క్లుప్తంగా

8న స్వాతి నక్షత్రవేడుకలు


శ్రీ చెంచులక్ష్మి సమేత పావన నరసింహస్వామి

బనగానపల్లె రూరల్: స్థానిక రవ్వలకొండపై ఉన్న శ్రీ చెంచు లక్ష్మి సమేత పావన నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బాలిశెట్టి పవన నరసింహమూర్తి గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం తులసి దళాలతో అర్చన, కుంకుమార్చన తదతర ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్


ప్రిన్సిపాల్ హెమీమా

అవుకు: ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైందని ప్రిన్సిపాల్ హెమీమా తెలిపారు. 6వ, 7వ, 8వ,9వ తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో సీట్లు ఖాళీ ఉన్నాయని ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే ఈనెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 25వ తేదీన విడుదల చేస్తారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాలను 26వ తేదీన పరిశీలిస్తామన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి


పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల అందజేసే పింఛన్ల ప్రక్రియను గురువారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి నెల పేదలకు తమ వంతు సాయంగా ఫించన్లు అందజే స్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సంస్థ సభ్యులు మహేశ్వరరెడ్డి, రాములమ్మ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజ స్తంభ ప్రతిష్ఠను తిలకిస్తున్న భక్తులు

సంజామల: ముచ్చలపురి గ్రామంలో శ్రీగణపతి శ్రీగౌరిదేవి, నాగదేవతా, రాములమ్మ, పోతురాజు విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం అర్చకులు యంత్రస్థాపన, కుంభాబిషేకం చేసిన అనంతరం విగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. భక్తులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతిభ అవార్డుకు ఎంపిక


వెంకట శ్రీ వేణి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన విద్యార్థిని బత్తుల వెంకట శ్రీవేణి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు. విద్యార్థిని ఎంఈసీ గ్రూపులో 861 మార్కులు సాధించడంతో ప్రతిభ అవార్డుకు ఎంపిక చేశారని వెల్లడించారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల : పట్టణంలోని గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. గ్రంథాలయ అధికారి మధుశేఖర్, ఉపాధ్యాయురాలు కృష్ణ ప్రియ చేతుల మీదుగా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యార్థులు తరచూ గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు.

పుడమికి జీవం

- పశువుల ఎరువుతో నేల సారవంతం
- గ్రామాల్లో పశువుల ఎరువుకు డిమాండ్
- ట్రాక్టర్ రూ.2500 నుంచి రూ.3 వేల వరకు విక్రయం
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి


పొలాల్లో వేసిన పేడ ఎరువు,


ట్రాక్టర్ ద్వారా ఎరువును పొలాలకు తరలిస్తున్న రైతన్నలు

బనగానపల్లె రూరల్/సంజామల: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతుంది. దీన్ని దుక్కులు దున్నడానికి ముందే భూమిలో వేసి దున్నితే మంచిది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. బనగానపల్లె మండలంలో 30 వేల ఎకరాల్లో సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వరి, మొక్కజొన్న, కంది, మినుము, మిరప తదితర పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా వారం నుంచి పశువుల పేడను పొలాల్లో వేస్తున్నారు.

భూసారం పెంపు

పంట సాగుకు కొద్ది రోజుల ముందు పశువుల ఎరువును ఎకరానికి నాలుగు ట్రాక్టర్లను పొలంలో వేసి కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది, సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నిటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందేలా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు. వీటితో పాటు ఎకరా భూమికి 1.5 క్వింటాళ్ల వేపపిండి కలపడం ద్వారా వేరు పురుగులు నశిస్తాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఫలితంగా రసం పీల్చే పురుగుల నివారణ సాధ్యమవుతుంది.

ఎంతో ఉపయోగం



రసాయన ఎరువులతో భూసారంపై తీవ్ర ప్రభావం చూపి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. రైతులు సేంద్రీయ ఎరువుల వాడడం వల్ల మెక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చీడపురుగులు, తెగుళ్ల నుంచి బడటపడే అవకాశాలు ఉంటాయి. తెగుళ్ల సోకకుంటే అధిక దిగబడి పొందవచ్చు. రైతులకు ఖర్చు తగ్గుతుంది. –సుధాకర్ రెడ్డి, ఏఓ

పశువుల ఎరువుకు పెరిగిన డిమాండ్

పశువుల ఎరువుతో ఎంతో ఉపయోగం ఉండడంతో ఈ ఎరువుకు డిమాండ్ పెరిగింది. రైతులు తమకు ఉన్న పశువుల దిబ్బను తమ పొలాలకు తరలించుకోవడమే కాకుండా మరికొంత అవసరం ఉండడంతో ట్రాక్టర్ ఎరువు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రసాయన ఎరువుల వాడకం చాలా వరకు తగ్గుతుందని రైతులు భావిస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఎరువుల ధర సుమారు రూ.300 వరకు పెరిగిందని రైతులు వాపోతున్నారు.

ఖర్చులు తగ్గుతాయి



పశువుల ఎరువులో నత్రజని, భాస్వరం, పొటాషియం ఉంటాయి. వీటిని పొలంలో ఉపయోగించడం వల్ల భూమి సారవంతమవుతుంది. తక్కు ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు. పాడి రైతుల నుంచి పేడ ఎరువు కొనుగోలు చేసి నాకున్న పొలంలో తోలుకుంటున్నాను. ఏటా వరి, మిరప, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నా. వీటిని వినియోగిస్తుండడం వల్ల మంచి ఫలితాలు ఉంటున్నాయి.
–కాటసాని రామక్రిష్ణారెడ్డి, రైతు, మిట్టపల్లె

దిగుబడి పెరుగుతుంది



పొలంలో పశువుల ఎరువును వేసుకోవడం వల్ల నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందేలా సహాయపడతాయి. నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఎకరానికి రెండు ట్రాక్టర్ల చొప్పున పశువుల ఎరువును వేసి దున్నించడం ద్వారా భూమి గుల్లబారుతుంది. పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా మంచి దిగుబడులు వస్తాయి.
–పరమేశ్వరరెడ్డి, రైతు, యాగంటిపల్లె

దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్ : పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లీషు మీడియాలతో పాటు ఎంబైపీసీ, ఒకేషన్ కోర్సులైన అకౌంట్ అండ్ ఆడిటింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తులు స్థానిక కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

బేతంచెర్ల: భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు భార్య సావిత్రి 10 రోజుల క్రితం భర్తతో గొడవ పడి పట్టిళ్లు అయిన మహానంది మండలం బసాపురానికి వెళ్లిపోయింది. తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన బోయ వెంకటేశ్వర్లు(30) గురువారం పేడ రంగు ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. తల్లి లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కలశ్‌యాత్రను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌యాదవ్

కోవెలకుంట్ల: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రెజాంగ్ లా రాజ్ కలశ్ యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల మోహన్ యాదవ్ కోరారు. గురువారం కోవెలకుంట్లలో యాదవ సంఘం జిల్లా నాయకుడు బాలుయాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ప్రాంభమయ్యే ఈ యాత్ర కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కలశ్‌యాత్రను జయప్రదం చేసేందుకు యాదవులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. చైనాలోని రేజాంగ్ ప్రాంతంలో అహిర్ యాదవ్ రెజిమెంట్‌లోని 118 మంది యాదవ రెజిమెంట్లు చైనా దేశ సైనికులతో వీరోచితంగా పోరాడి వారిని మట్టికరిపించిన చరిత్ర అహిర్ యాదవ రెజిమెంట్లదేనన్నారు. ఆ రెజిమెంట్‌ను యథాతథంగా కొనసాగించాలని కోరుతూ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాయలసీమ కన్వీనర్లు కాటమ రాజు, శేషఫణి, జిల్లా కన్వీనర్ శివకృష్ణ, ఆ సంఘం నాయకులు రామచంద్రుడు, బాబు, నాగేశ్వరరావు, పృథ్వీరాజ్, చంద్రశేఖర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి

డోన్: కరోనా సందర్భంగా రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు డిమాండ్ చేశారు. ఈనెల7, 8 తేదీలలో సంతకాల సేకరణ, 9వ తేదీన రైల్వే స్టేషన్‌ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్న తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని స్థానిక నక్కిరామన్న భవనంలో గురువారం కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కర్నూలు నుంచి నేటి రాజధాని విజయవాడకు, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సౌకర్యాంగా ఉండే విధంగా నడుస్తున్న రైలును కరోనా సందర్భంగా రద్దు చేసి నాలుగు సంవత్సరాలు అవుతుందన్నారు. రైలు రద్దు చేయడం వలన చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నక్కి లెనిన్‌బాబు, రాధాకృష్ణ, మండల కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో తగిన గుర్తింపు


సుధాకర్‌రెడ్డిని అభినందిస్తున్న బుగ్గన

డోన్: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వలంటర్ విభాగం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గుమ్మకొండ సుధాకర్‌రెడ్డిని గురువారం బుగ్గన అభినందించారు. పదవులు చేపట్టిన వారందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

డోన్: మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ డోన్ నియోజకవర్గ కార్యదర్శులు అబ్బాస్, అన్వర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక అన్న క్యాంటీన్ వద్ద గురువారం హరితాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు హరి, గౌస్, చంద్ర, భాస్కర్, అజయ్, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.

10, 11న యాగంటిపల్లెలో పెద్దమ్మ దేవర


పెద్దమ్మ తల్లి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో ఈ నెల 10, 11 తేదీల్లో శ్రీపెద్దమ్మ తల్లి దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ప్రజలు గురువారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ రాత్రి గ్రామంలో పెద్దమ్మ తల్లికి పూజలు, 11న దేవర మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్ని దేవర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు, రైతులు ప్రజలు కోరారు.

ఇసుక టిప్పర్ బోల్తా


బోల్తాపడిన ఇసుక టిప్పర్

బేతంచెర్ల : మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామ సమీపాన ఉన్న బ్రిడ్జి వద్ద గురువారం ప్రమాదవశాత్తు ఇసుక టిప్పర్ బోల్తాపడింది. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఇసుక లోడుతో బేతంచెర్ల వైపు వస్తున్న టిప్పర్ గోర్లగుట్ట బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దేవరంగకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో బేతంచెర్లకు తరలించారు. ఆసమయంలో ఇరువైపులా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


ఏనుగుమర్రిలో వాటర్ గ్రిడ్ సంపు పనులు,


ఓవర్ హెడ్ ట్యాంకు

అభివృద్ధి పనులకు గ్రహణం


ఎన్‌రంగాపురంలో ఆగిన నాడు–నేడు పనులు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన నిర్మాణాలు ప్రభుత్వం మారిన తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా అభివృద్ధి పనులకు సంబంధించిన నిర్మాణాలు ప్రారంభం కాలేదు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన నాడు–నేడు, సచివాయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, వాటర్ గ్రిడ్ వంటి పనులన్నీ ఆగిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆగిన నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. –ప్యాపిలి:


సుజాతమ్మను నిలదీస్తున్న గ్రామస్తులు

సుజాతమ్మకు మురుగు కాలువ సెగ

డోన్ టౌన్ : గ్రామంలో నెలకొన్న మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలని మల్లెంపల్లె గ్రామ ప్రజలు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను నిలదీశారు. గురువారం గ్రామంలో జరుగుతున్న ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆమెను గ్రామస్తులు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని చూపిస్తూ సమస్యను పరిష్కరించాలని కోరారు. అమె స్పందిస్తూ వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని సమాధానం ఇవ్వగా.. ఎవ్వరు వచ్చినా ఈలాగే చెబుతున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని ప్రజలు నిట్టూర్చారు.

పర్యావరణ సమతుల్యతతోనే మానవ మనుగడ




షిరిడీసాయి ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కోవెలకుంట్ల: ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

డోన్ : పర్యావరణ సమతుల్యతతోనే మానవ మనుగడ సాధ్యమని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం ద్వారా అనేక ప్రకృతి విపత్తులు సంభవించడమే కాక, సమస్త జీవరాశులతో పాటు మానవాళి మనుగకు పెను ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర .. హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన స్థానిక సాయిబాబా దేవాలయంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించిన నాడే పర్యావరణం సమతుల్యాంగా ఉంచగలుగుతామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఇంతియాజ్‌బాషా, ఆలయ ధర్మకర్తలు శ్రీరాములు, సీఎం శ్రీను, మల్లికార్జునరెడ్డి, పార్థ, కొండా సురేష్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో..

పచ్చదనం పరిశుభ్రతతోనే మానవుడు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలుగుతారని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ అన్నారు. ఆసుపత్రి ఆవరణలో వైద్యులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ భారతి, డాక్టర్ సుకుమార్, డాక్టర్ వీరేష్, డాక్టర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- **డోన్ టౌన్:** పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద, ప్రభుత్వ వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మొక్కలు నాటారు. అలాగే స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ శశిభూషణ్ ఆధ్వర్యంలో సిబ్బంది పుల్లయ్య, జాన్‌మోజేస్, యూనియన్ నాయకులు మొక్కలు నాటారు. ఆర్డీఓ నరసింహులు, రూరల్ ఎస్ఐ మమతతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.
- **ప్యాపిలి:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బోయిన్‌చెర్వుపల్లి సమీపంలోని ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీలో రెయిన్ సిమెంట్స్ ఆధ్వర్యంలో కార్మికులు 700 మొక్కలు నాటారు.
- **బేతంచెర్ల:** మొక్కలే మానవ మనుగడకు ఆధారమని.. ఈ విషయాన్ని గుర్తించి మొక్కలు నాటాలని నంద్యాల జిల్లా డ్వామా మానిటరింగ్ అధికారి భాస్కర్ నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, సూపరింటెండెంట్ దస్తగిరిబాబుతో కలిసి మొక్కలు నాటారు. అలాగే నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వార్డు కౌన్సిలర్ అంజి, సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నంద్యాల రహదారిలో మొక్కలు నాటారు.


సంజామల: పీహెచ్‌సీ ఆవరణలో..

ఇంటికో చెట్టు.. ఆరోగ్యానికి తొలిమెట్టు

కోవెలకుంట్ల: అడవులు అంతరించిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మొక్కలు నాటారు. ఇంటికో చెట్టు ఆరోగ్యానికి తొలి మెట్టని.. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, క్రీడామైదానాల ఆవణల్లో విరివిగా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. అలాగే డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ రంజిత్‌కుమార్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటారు.

- **సంజామల:** పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ పోచ రమాదేవి అన్నారు. సంజామల ప్రథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ అనీల్ కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు మంచి గాలి అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఏపీఓ జయంతి, ఏపీఎం గురుస్వామి, మెడికల్ ఆఫీసర్ కృష్ణ కుమారి, ఈఓఆర్డీ రాధికారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలేఖ పాల్గొన్నారు.
- **కొలిమిగుండ్ల:** పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా పాఠశాలలు ,ప్రభుత్వ కార్యాలయాలు, బెలుం గుహలు తదితర ప్రదేశాల్లో 2 వేల మొక్కలు నాటారు. స్థానిక జగనన్న కాలనీ వాసులకు ఇళ్ల ముందు నాటేందుకు మొక్కలను పంపిణీ చేశారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ, మైన్స్ ఆవరణలో 4వేల మొక్కలను యూనిట్‌హెడ్ మీనాక్షి సుందరం, అడ్మిన్‌హెడ్ రామరాజు నాటారు. పీఆర్, హౌసింగ్ ఏఈలు అన్వర్‌హుసేన్, మద్దిలేటి, ఎంఈఓ అబ్దుల్ కలాం పాల్గొన్నారు.


బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ, కమిషనర్


మొక్కలు నాటుతున్న రామ్‌కో ప్రతినిధులు

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత


బనగానపల్లె: మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ

బనగానపల్లె రూరల్: మొక్కలతో పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని.. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రతిమ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ రామకృష్ణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు షెహెన్‌షావలి, సురేంద్రనాయుడు, జయశంకర్‌నాయక్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.